## 'ఏపీ గ్రీన్' పగ్గాలు నాగబాబుకు

### కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

మంగళగిరిలోని అరణ్య భవన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 'ఏ పీ గ్రీన్' సొసైటీ కార్యనిర్వాహక కమి టీ ఛైర్మన్‌గా కొణిదెల నాగబాబు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సతీమణి పద్మజతో కలిసి కార్యక్రమానికి హాజరైన ఆయన, రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తరణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారు. అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.



మంగళగిరి: రక్షణ న్యూస్

2లో.


మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

శనివారం 29 ఆగస్టు 2026 పేజీలు : 4




ఉమ్మడి గుంటూరు రక్షణ న్యూస్

# జెడ్పీకి ఇక కొత్త రూపం

- మూడు జిల్లాలకు మూడు జిల్లా పరిషత్‌లు..
- స్థానిక ఎన్నికల కసరత్తు ముమ్మరం
- సెప్టెంబరు 24తో ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం పూర్తి..
- కొత్త జెడ్పీటీసీ స్థానాలపై కసరత్తు

2లో.

దశాబ్దాలుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌గా కొనసాగుతున్న వ్యవస్థకు తెరపడనుంది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్లకు వేర్వేరుగా జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుత జెడ్పీ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబరు 24తో ముగియనున్న నేపథ్యంలో కొత్త స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సన్నాహాలు ముమ్మరం చేశారు.

## ఏడేళ్లు పూర్తయినా బదిలీ ఏదీ..?

### ఎలక్షన్ ఆపరేటర్ల విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్

బాపట్ల బ్యూరో : రక్షణ న్యూస్



2లో.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు బాపట్ల జిల్లాలో అమలవుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకే కార్యాలయంలో ఏడేళ్లు పూర్తి చేసిన ఎలక్షన్ ఆపరేటర్లను బదిలీ చేయాలని గతంలోనే ఉత్తర్వులు జారీ చేసినా.. ఏడాది గడిచినా కొందరు యథాస్థానాల్లోనే కొనసాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ కీలక దశలో ఉన్న సమయంలోనూ బదిలీలపై అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## పల్నాడు రైతాంగానికి కూటమి సర్కారు అన్యాయం

### వరికపూడిశెల ప్రాజెక్టుపై ఎంపీ మౌనం ఎందుకు? : బొల్లా బ్రహ్మనాయుడు



2లో.

పల్నాడు రక్షణ న్యూస్

పల్నాడు రైతాంగం సాగు, తాగునీటి సమస్యలతో అల్లాడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజమెత్తారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు వచ్చాయని చెప్పిన నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఇప్పుడు దానిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/29/2026 6:06 AM Page 2



# ‘ఏపీ గ్రీన్’ పగ్గాలు నాగబాబుకు

మొదటి పేజీ తరువాయి

**మంగళగిరి: రక్షణ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం, అటవీ విస్తరణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లే బాధ్యతలను జనసేన పార్టీ శాసన మండలి సభ్యుడు కొణిదెల నాగబాబు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రీచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలోని అరణ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాగబాబు తన సతీమణి పద్మజతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటం, పచ్చదనాన్ని పెంపొందించడం, అటవీ ప్రాంతాల అభివృద్ధి, విస్తృతంగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలకు ఏపీ గ్రీన్ సొసైటీ ద్వారా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంచేందుకు చేపట్టాల్సిన కార్యక్రమా లు, వాటి అమలు తీరుపై దృష్టి సారించాల్సిన బాధ్యత నాగబాబుపై ఉంది. వాతావరణ మార్పులు, పర్యావరణ కాలు ష్యం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో అటవీ విస్తరణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగింది. ఈ నేపథ్యంలో ఏపీ గ్రీన్ సొసైటీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త బాధ్యతలు స్వీకరించిన నాగబాబు నేతృత్వంలో ఏపీ గ్రీన్ సొసైటీ రాష్ట్రంలో పచ్చదనం, రీఫారెస్టేషన్ కార్యక్రమాలకు మరింత ఊతమిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం కీలకం కానుంది.

# జెడ్పీకి ఇక కొత్త రూపం

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి గుంటూరు రక్షణ న్యూస్**

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఇక చరిత్రగా మారనుంది. 1964 నుంచి కొనసాగుతున్న ఉమ్మడి జెడ్పీ వ్యవస్థ జిల్లాల పునర్విభజనతో కొత్త రూపు సంతరించుకోనుంది. గుంటూరు జిల్లాతోపాటు పల్నాడు, బాపట్ల జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో ఇన్నాళ్లూ ఒకే పరిషత్ పరిధిలో ఉన్న ప్రాంతాలు ఇక మూడు వేర్వేరు జిల్లా పరిషత్‌ల పరిధిలోకి వెళ్లనున్నాయి.

**మూడు జిల్లాలకు మూడు జెడ్పీలు...** ఇప్పటి వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో 57 మంది జెడ్పీటీసీ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో ఈ నిర్మాణం మారనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మండలాలను పరిగణనలోకి తీసుకుని కొత్తగా జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేయనున్నారు. ప్రతి జిల్లాకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ తదితర పదవులు ఏర్పడనున్నాయి. దీంతో మూడు జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక రాజకీయ సమీకరణాలు కూడా మారనున్నాయి. కొత్త జెడ్పీ పరిధులు, జెడ్పీటీసీ స్థానాలు, రిజర్వేషన్లపై రాజకీయ పార్టీల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ ఏ జిల్లాకు ఏ విధంగా వస్తుందన్నది కీలకంగా మారనుంది.

**సెప్టెంబరు 24 కీలకం...** ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబరు 24తో ముగియనుంది. అంతకుముందే కొత్త పాలకవర్గాల ఎన్నికలు పూర్తవుతాయా? లేక ప్రత్యేకాధికారుల పాలన వస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత జెడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నాయి. స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి వచ్చే నిధులను వినియోగించుకోవాలంటే ఎన్నికైన పాలకవర్గాలు ఉండాల్సిన అవసరం ఉందన్న అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులు భావిస్తున్నారు. అయితే జెడ్పీల పునర్విభజన, కొత్త స్థానాల ఏర్పాటు, రిజర్వేషన్ల ఖరారు వంటి ప్రక్రియలకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

**ఓటర్ల జాబితాపైనే ఆధారం..** కొత్త జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్ల ఖరారులో ఓటర్ల గణాంకాలు కీలకంగా మారనున్నాయి. 2026 జనవరి 1న కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. వార్డు, గ్రామం, మండల స్థాయిలో ఉన్న ఓటర్ల వివరాలను పరిశీలించి స్థానాల కేటాయింపుపై కసరత్తు జరగనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు భిన్నంగా ఈ ప్రక్రియ చేపట్టనున్నారు

**ఎన్నికల విభాగంపై పెరిగిన భారం...** మూడు జిల్లాల్లో జెడ్పీ ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో ఎన్నికల యంత్రాంగంపై అదనపు బాధ్యత పడనుంది. కొత్తగా ఏర్పడే జెడ్పీలకు అవసరమైన సీఈఓ, డిప్యూటీ సీఈఓ, ఇతర సిబ్బంది నియామకాలు కూడా చేపట్టాల్సి ఉంటుంది. కొత్త పరిపాలనా నిర్మాణానికి అనుగుణంగా కార్యాలయాలు, సిబ్బంది, విధులు, ఎన్నికల నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాల సవరణ, రిజర్వేషన్లపై అధికారులు దృష్టి సారించారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు ఒకేసారి రాజకీయ వేడిని పెంచే అవకాశం ఉంది. కొత్త జెడ్పీ పరిధులు ఖరారైన తర్వాత ఏ మండలం ఏ జిల్లా పరిషత్‌లోకి వెళ్తుందన్న అంశంపై కూడా స్పష్టత రానుంది.

**రాజకీయంగా కీలక పరిణామం...** మూడు జిల్లాలుగా విడిపోయిన తర్వాత తొలిసారి ప్రత్యేక జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు ఇది ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు సిద్ధం చేసుకునే అవకాశం ఉంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల స్థాయిలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపడంతోపాటు ఛైర్మన్ పదవులను లక్ష్యంగా చేసుకుని రాజకీయ సమీకరణాలు వేగంగా మారనున్నాయి. మొత్తంగా ఉమ్మడి గుంటూరు జెడ్పీ మూడు ముక్కలుగా మారడం కేవలం పరిపాలనా మార్పే కాకుండా.. మూడు జిల్లాల గ్రామీణ రాజకీయాల్లోనూ కొత్త అధ్యాయానికి నాంది కానుంది. సెప్టెంబరు 24 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పునర్విభజన, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాలు, ఎన్నికల నిర్వహణపై అధికారుల తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది.

# పల్నాడు రైతాంగానికి కూటమి సర్కారు అన్యాయం

మొదటి పేజీ తరువాయి

**పల్నాడు రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా రైతాంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీరు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. పల్నాడు ప్రాంతానికి సాగునీరు అందించే కీలక ప్రాజెక్టులను పక్కన పెట్టి కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు నాయుడు, కోడెల శివప్రసాదరావు హయాంలో రాయపాడు వద్ద గోదావరి జలాలను నాగార్జునసాగర్ కుడి కాలువకు అనుసంధానం చేసే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని బొల్లా గుర్తుచేశారు. సుమారు రూ.6 వేల కోట్లతో ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే పల్నాడులో దాదాపు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, రైతులు మూడు పంటలు పండించుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారని ఆరోపించారు. కేంద్రంలో తమకు పలుకుబడి ఉందని చెప్పుకునే నరసరావుపేట ఎంపీ పల్నాడు జిల్లాకు ఏం సాధించారో ప్రజలకు వివరించాలని బొల్లా డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నరసరావుపేటకు వచ్చిన సమయంలో భారీ కార్యక్రమం నిర్వహించినా.. పల్నాడు రైతుల ప్రధాన సమస్యగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.

**వరికపూడిశెలపై ఎందుకు మౌనం?...** వరికపూడిశెల ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చాయని గతంలో ప్రకటించిన నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తుతం ఆ ప్రాజెక్టు గురించి మాట్లాడకపోవడానికి కారణమేంటని బొల్లా నిలదీశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మాచర్ల, గురజాల, బొల్లాపల్లి, వినుకొండ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయని తెలిపారు. కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లకుండా ఇప్పుడు పోలవరం--బనకచర్ల ప్రాజెక్టు పేరుతో కొత్త నినాదాన్ని తెరపైకి తీసుకురావడం ప్రజల దృష్టిని మళ్లించేందుకేనని విమర్శించారు. పల్నాడు రైతుల తక్షణ అవసరాలను గుర్తించి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు.

**రైతులకు బీమా అందడం లేదు...** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఈ-క్రాప్ ద్వారా రైతులకు పంటల బీమా అందించి అండగా నిలిచామని బొల్లా తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు బీమా పరిహారం అందించడంలో విఫలమైందని ఆరోపించారు. వినుకొండ నియోజకవర్గంలో పంటలు పండక, తాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో సొసైటీ రుణాల వసూళ్ల పేరుతో వారిని వేధించడం సరికాదన్నారు. రుణాల వసూళ్ల కోసం రైతుల ఇళ్లకు వెళ్లి ఫొటోలు తీసి బోర్డులు, గ్రూపుల్లో ప్రచారం చేయడం ద్వారా వారి పరువుకు భంగం కలిగిస్తున్నారని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. రాజకీయ కక్షసాధింపులు, అరెస్టులు, అబద్ధపు హామీలకు స్వస్తి పలికి పల్నాడు రైతాంగాన్ని ఆదుకోవాలని బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు. గతంలో శంకుస్థాపన చేసిన గోదావరి జలాల అనుసంధాన ప్రాజెక్టుతో పాటు వరికపూడిశెల ప్రాజెక్టు పనులను తక్షణమే ప్రారంభించి రైతులకు సాగు, ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు.

# ఏడేళ్లు పూర్తయినా బదిలీ ఏదీ..?

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల బ్యూరో : రక్షణ న్యూస్**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు ఒకే కార్యాలయంలో ఏడు సంవత్సరాలకుపైగా పనిచేసిన ఎలక్షన్ ఆపరేటర్లను తప్పనిసరిగా బదిలీ చేయాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు బాపట్ల జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఏడు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన పలువురు ఎలక్షన్ ఆపరేటర్ల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ.. ఏడాది గడిచినా కొందరు ఇప్పటికీ యథాస్థానాల్లోనే కొనసాగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించే సిబ్బంది ఒకే ప్రాంతంలో దీర్ఘకాలం పనిచేయడం వల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం బదిలీల నిబంధనలను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలోనూ ఈ అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**పర్యవేక్షణాధికారికే తెలియదా?...** జిల్లాలో ఎలక్షన్ ఆపరేటర్ల బదిలీలు పూర్తిగా జరిగాయా? లేదా? అనే అంశాన్ని పర్యవేక్షించాల్సిన ఎలక్షన్ సూపరింటెండెంట్ షఫీని ప్రశ్నించగా.. "నాకేం తెలియదు" అన్న సమాధానం ఇవ్వడం శాఖలోనే పలు అనుమానా లకు తావిస్తోంది. బదిలీల అమలు, సిబ్బంది ప్రస్తుతం ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు, ఎన్నికల విధులకు కేటాయించబడ్డారా? అనే అంశాలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారే తనకు సమాచారం లేదని చెప్పడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**బాపట్ల మున్సిపాలిటీలో ఆపరేటర్ ఎక్కడ?/...**బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నప్పటికీ.. ఉత్తర్వులు ఉన్నా మున్సిపాలిటీకి కేటాయించాల్సిన ఎలక్షన్ ఆపరేటర్ గౌరీ అక్కడ విధులు నిర్వహించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీకి ఎలక్షన్ ఆపరేటర్ లేకుండానే ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఒకే ఎలక్షన్ ఆపరేటర్ బాపట్ల రూరల్, పంచాయతీల ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. మున్సిపాలిటీకి వెళ్లాల్సిన ఆపరేటర్ మాత్రం తహసీల్దార్ కార్యాలయంలోనే కొనసాగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అసలు కేటాయించిన విధులను పక్కనపెట్టి ఇతర కార్యాలయ పనులు చేయించడం వెనుక ఉన్న కారణాలేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**ఎమ్మార్వోల కింద కీలక విధులా?/...**బాపట్ల, వేమూరు తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఈఆర్ఓ/ఏఈఆర్ఓ ఎలక్షన్ ఆపరేటర్లను ఎన్నికల విధులకు పరిమితం చేయకుండా ఇతర పరిపాలనా పనుల్లో వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫైళ్ల పరిశీలన, క్లియరెన్స్ వంటి కీలక పనుల్లో వారు ఎమ్మార్వోలు, ఆర్డీవోల కార్యాలయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారనే సమాచారం శాఖలో చర్చకు దారితీస్తోంది. ఒక్క పర్చూరు మినహా జిల్లాలోని పలుచోట్ల ఎలక్షన్ ఆపరేటర్లు అసలు ఎన్నికల విధులను పక్కనపెట్టి ఇతర అధికారుల కింద పనిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధుల్లో కాకుండా ఇతర పనులకు వారిని వినియోగించడం నిబంధనలకు ఎంతవరకు అనుగుణమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కలెక్టర్ దృష్టికి వెళ్లినా ఎందుకు మౌనం?...** జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఎస్ఐఆర్, ఎన్నికల నిబంధనల అమలుపై పలుమార్లు సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఏడు సంవత్సరాలకుపైగా ఒకేచోట పనిచేస్తున్న ఎలక్షన్ ఆపరేటర్ల బదిలీల అంశంపై మాత్రం స్పష్టమైన చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషించే సిబ్బంది విషయంలో ఇంతకాలం ఎందుకు నిర్ణయం తీసుకోలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల సిబ్బంది నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం విధులు నిర్వహించడం అత్యంత కీలకం. గతంలోనే జారీ చేసిన బదిలీ ఉత్తర్వులను అమలు చేయకుండా సిబ్బందిని యథాస్థానాల్లో కొనసాగిస్తే.. భవిష్యత్తులో ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు వచ్చినప్పుడు బాధ్యత ఎవరిదన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల అమలును అడ్డుకుంటున్నది ఎవరు? బదిలీ ఉత్తర్వులు అమలు కాకపోవడానికి కారణాలేంటి? అనే అంశాలపై జిల్లా అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## బషీర్‌బాగ్ అమరవీరులకు ఘన నివాళి

**బాపట్ల రక్షణ న్యూస్**




బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణు వర్ధన్‌రెడ్డిలను స్మరిం చుకుంటూ శుక్రవారం బాపట్ల పాత బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం బాపట్ల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య మాట్లాడుతూ.. 2000 ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపు, విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన బషీర్‌బాగ్ పోరాటంలో ముగ్గురు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగం చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజలపై భారాలు మోపే విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజాధనాన్ని పెట్టుబడిదారులకు అప్పగించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ప్రజలకు చౌకగా, నాణ్యమైన విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ప్రోత్సహించడం నిలిపివేయాలని కోరారు. బషీర్‌బాగ్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజలపై భారాలు మోపే ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కొండయ్య, సీనియర్ నాయకులు కె. నాగేశ్వరరావు, భాస్కరరావు, ఎన్. కోటేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బుచ్చిరాజు, సీపీఎం పట్టణ నాయకులు కె. శరత్, జి. మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో అగ్రస్థానంలో ఆనందబాబు

**వేమూరు రక్షణ న్యూస్**




ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చురుగ్గా ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తక్షణమే స్పందిస్తూ అధికార యంత్రాంగంతో సమన్వయం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తున్నారు. ఇటీవల పేటేరు గ్రామస్తులు వ్యవసాయ నీటి సరఫరా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి ఆనందబాబు చొరవ చూపడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రహదారులు, సాగునీరు, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆనందబాబు కృషి చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపుతున్న తీరు ఆయనపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. తన రాజకీయ, పరిపాలనా అనుభవాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తూ.. సమస్య ఏదైనా పరిష్కారమే లక్ష్యంగా ఆనందబాబు చూపుతున్న చొరవపై నియోజకవర్గ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీస్సులు



**దాచేపల్లి రక్షణ న్యూస్**

గురజాల నియోజకవర్గం దాచేపల్లి టౌన్ నారాయణపురంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఐనాల శ్రీరాములు, శ్రీమతి సునీత దంపతుల నివాసానికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విచ్చేశారు. ఇటీవల వివాహం చేసుకున్న వారి కుమారుడు అనంత్ శివకుమార్, ధరణి నూతన దంపతులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కృష్ణా జలాల కోసం రైతుల నిరసన

పర్చూరు రక్షణ న్యూస్

కృష్ణా జలాలను పర్చూరు ప్రాంతానికి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన నిరసన దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం అన్నంభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన 11 మంది రైతులు దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం భూసేకరణకు సంబంధించి గజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, పర్చూరు ప్రాంతానికి సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. కృష్ణా జలాలను పర్చూరు వరకు తీసుకురావడానికి అవసరమైన భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంపై శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తున్న శిబిరాన్ని అధికారులు, పోలీసులు తొలగించడాన్ని రైతులు తీవ్రంగా ఖండించారు. దీంతో బొమ్మల సెంటర్‌లోని రహదారి పక్కన వేపచెట్టు కింద దీక్షలను కొనసాగించాల్సి వచ్చిందని తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలిపే తమ ప్రాథమిక హక్కులను ప్రభుత్వం, అధికారులు నిరాకరించడం సరికాదన్నారు. దీక్షా శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. పర్చూరు ప్రాంతంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కోసం ప్రజలు, రైతులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కృష్ణా జలాలు పర్చూరు వరకు చేరే వరకు ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు



ఈ నెల 31లోగా గజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నీటి కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా కృష్ణా జలాలను పర్చూరు వరకు తీసుకురావాలన్న తమ డిమాండ్ నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. దీక్షలో గోరంట్ల భాస్కరరావు, గోరంట్ల సుబ్బారావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, నాయుడు సుబ్బారావు, తోకల కృష్ణమోహన్, వనమా పేతురు, తెలగతోటి పేతురు, కొమ్మినేని శ్రీనివాసరావు, మత్తే డేవిడ్, డాక్టర్ కొల్లా రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు. గాదె మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు, ప్రజలు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

# ఆలయ ఆక్రమణల తొలగింపునకు అర్జీ



పీవీ పాలెం రక్షణ న్యూస్

చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయ స్థలంలో ఆక్రమణలను తొలగించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రజా గ్రీవెన్స్‌లో అర్జీ సమర్పించారు. బాపట్ల నియోజకవర్గ ప్రజా దర్బా ర్‌లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, జాయింట్ కలెక్టర్ భావన వశిష్టలకు వినతిపత్రం అందజేశార .ఆలయానికి చెందిన స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని, ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారికి మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని ట్రస్ట్ బోర్డు సభ్యులు విజ్ఞప్తి చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన అమ్మవారి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అర్జీపై జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట వెంటనే స్పందించారు. దేవాదాయ శాఖాధికారి నాగయ్య ద్వారా ఆలయ స్థలానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని, తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఆలయ స్థల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, భక్తుల సౌకర్యాల కల్పనపై అధికారుల నుంచి సానుకూల స్పందన లభించడంతో ట్రస్ట్ బోర్డు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## హెల్మెట్ పై ప్రత్యేక తనిఖీలు

కర్లపాలెం రక్షణ న్యూస్



రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల భద్రతే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కర్లపాలెంలో ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఎస్ఐ రవీంద్ర హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. 'శిరోరక్షే ప్రాణరక్ష' అని పేర్కొంటూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేకపోతే చలానాలు విధిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలతో పాటు జైలుశిక్ష కూడా తప్పదని వాహనదారులను హెచ్చరించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ రవీంద్ర సూచించారు.

## 22-ఏ భూములపై డీఎల్ఎస్‌సీ సమీక్ష





బాపట్ల రక్షణ న్యూస్

22-ఏ కేసులు, 1954కు ముందు ఉన్న నిషేధిత జాబితా భూములకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో డీఎల్ఎస్‌సీ సమావేశం జరిగింది. సమావేశంలో మొత్తం 13 అంశాలను పరిశీలించగా, 10 అంశాలకు ఆమోదం, మూడు అంశాలకు తిరస్కరణ తెలిపారు. భూముల రికార్డులు, నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు సంబంధించిన అంశాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకున్నారు. జేసీ భావన, డీఆర్వో లవన్న, ఏడీ సర్వేయర్ శేషగిరి, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, చీరాల ఆర్డీవో నరసింహా రావు, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి




గుంటూరు రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు, పలు అంశాలపై స్పందించారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఇటీవల పలు ప్రైవేట్ సంస్థలు నిర్వహించిన సర్వేలు వెల్లడించాయని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో వాస్తవాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబుకు అస్వస్థత

గుంటూరు రక్షణ న్యూస్



మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నేత అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అంబటి రాంబాబు గుండెకు వైద్యులు స్టెంట్ వేశారు అని,ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. వైద్యుల పర్యవేక్షణలో అంబటి రాంబాబుకు చికిత్స కొనసాగుతుందని పార్టీ నాయకులు తెలిపారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/29/2026 6:06 AM Page 5



# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



## ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు

**పర్చూరు రక్షణ న్యూస్**

ప్రతి మహిళా ఆర్థికంగా స్వావలంబన సాధించి వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మహిళలకు అందిస్తున్న ఉన్నతి రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు ఇప్పటివరకు సుమారు రూ.వెయ్యి కోట్ల మేర రుణాలు అందించామని చెప్పారు. విద్య ద్వారా కుటుంబాల జీవనస్థితిగతుల్లో శాశ్వత మార్పు తీసుకురావచ్చని, ప్రతిభ ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రైతులకు అండగా 112 మందికి రూ.85 లక్షల విలువైన పంట నూర్పిడి పరదాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకే డీఎస్సీ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డీఎస్సీ విషయంలో వైసీపీ 200 కేసులు వేసి అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. అయినప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు సాగుతోందన్నారు.ఈ సందర్భంగా మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి.. మహిళా సాధికారత, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# పి4 తో పేదల జీవితాల్లో మార్పు



**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**

ప్రత్తిపాడు నియోజకవర్గంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న 'పి4--జీరో పావర్టీ' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో పి4 కార్యక్రమం అమలు తీరు, శాఖల పనితీరును అంచనా వేసే కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ), ప్రజా సమస్యల పరిష్కార వేదిక పురోగతి, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.పేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు, ఆర్థిక సాధికారత కల్పించడంపై సీఎం దిశానిర్దేశం చేశారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించాలని, పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అందుతున్న సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.గ్రామీణ, వార్డు స్థాయిలో పాలనను మరింత బలోపేతం చేసేందుకు ఎస్వీఏపీ యూనిట్ల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక ఆలోచనలకు అనుగుణంగా పి4, కేపీఐ, పీజీఆర్ఎస్ కార్యక్రమాలను నియోజకవర్గంలో సమర్థవంతంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు బ్యాంకుల సహకారాన్ని జోడించి పేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# ఎస్సీ, ఎస్టీల సమస్యలపై కలెక్టర్ సమీక్ష



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.గత సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ప్రస్తావించిన సమస్యలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేటపాలెంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, బాలుర ఎస్టీ గురుకులంలో విద్యార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన ఎన్‌ఓసీ పొందాలని ఆదేశించారు.చీరాల మండలం బుర్లవారిపాలెం, కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని కాలువ కట్టలపై నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు వెంటనే సోలార్ టార్చ్‌లు అందించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారికి ఇళ్ల సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎస్టీల ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని, పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాలు నిర్వహించి ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులు అందించాలని సూచించారు. దళితులకు కేటాయించిన భూములను 22-ఏ నుంచి తొలగించే అంశంపై మరోసారి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సభ్యులను ఆదేశించారు.సమావేశంలో అదనపు ఎస్పీ సుధాకర్, ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, డీఎస్పీలు, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం



**గుంటూరు రక్షణ న్యూస్**

ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ప్రజా దర్బార్‌లో ఇళ్ల నిర్మాణం, పెన్షన్లు, మౌలిక వసతులు, భూ సంబంధిత సమస్యలు తదితర అంశాలపై ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి వినతిని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రతి కుటుంబానికి న్యాయం చేయడం, ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం తన బాధ్యత అన్నారు. ప్రజల ఆశయాలే తన కార్యాచరణకు మార్గదర్శకమని, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంబంధిత అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికల పై సీఎం సమీక్ష

**అమృతలూరు రక్షణ న్యూస్**



వేమూరు నియోజకవర్గ సమగ్ర అభివృదికి అవసరమైన ప్రణాళికలను రూపొందించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సూచించారు. అమృతలూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, విజన్ కార్యాచరణ విభాగాల పురోగతి, ప్రభుత్వ--ప్రైవేటు--ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.నియోజకవర్గంలో అన్ని రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలు, ప్రజల భాగస్వామ్యంతో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను, విలువైన సూచనలను ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సమావేశంలో వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక విభాగం సమన్వయకర్త షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని, విభాగం సిబ్బంది పాల్గొన్నారు.